నవతెలంగాణ
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

పొంగిపొర్లుతున్న మాల్‌తుమ్మెద చెక్ డ్యామ్



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద శివారులో నూతనంగా చెక్ డ్యామ్ ఏర్పాటు చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి చెక్ డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతుందని ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. 3.18 లక్షలతో ఈ చెక్ డ్యామ్ నిర్మించినట్లు తెలిపారు. చెక్ డాం నిండడంతో 2 ఎకరాల పంటలకు నీరు అందే అవకాశం ఉందని డీఈఈ తెలిపారు. మాల్ తుమ్మెద, పోచారం, సర్దన గ్రామాల రైతుల పంటలకు పుష్కలంగా నీరు లభిస్తుందని ఆయన తెలిపారు. నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్ పొంగిపోవడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి ట్యాక్స్ ఎలా నిర్ణయిస్తారు..?

- మునిపల్లిలో ట్రైనీ అడిషనల్ కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామంలో శుక్రవారం ట్రైనీ అడిషనల్ కలెక్టర్ సంకిత్ కుమార్ గ్రామపంచాయతీ సందర్శించారు. ఇంటికి ట్యాక్స్ ఎలా నిర్ధారిస్తారని, కొలతలు ఏ విధంగా తీసుకుంటారని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి దగ్గరకు వెళ్లి కొలతలు తీసే ప్రక్రియ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపిఓ యూసుఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



కొలతలు తెలుసుకుంటున్న ట్రైనీ అధికారి

ఒక్కరి నిర్లక్ష్యం.. జీజీహెచ్‌కు రూ.9 కోట్ల నష్టం

- ఆరోగ్య శ్రీ కేసుల వివరాలు సకాలంలో ఎంట్రీ చేయకపోవడంతో నిలిచిన నిధులు
- డాటా ఎంట్రీపై పర్యవేక్షణ కరువు
- ప్రతేడాదీ నష్టపోతున్న వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తాత్కాలిక సిబ్బంది నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండేండ్లలో సుమారు రూ.9 కోట్ల నష్టం వాటిల్లింది. ఆరోగ్య శ్రీ కింద రోగులకు అందజేసిన సేవలకు సంబంధించిన వివరాలు సకాలంలో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకపోవడంతో ఆరోగ్య శ్రీ కింద ఆస్పత్రికి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో పెద్దమొత్తంలో ఆస్పత్రికి నష్టం వాటిల్లినట్టయింది. ఆ నిధులు వస్తే జనరల్ ఆసుపత్రిలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ, క్యాత్ ల్యాబ్ లాంటివి మిగతా పరీక్షల నిమిత్తం అవసరమైన పరికరాలను, ఇంకా ఎన్నో కొనుగోలు చేసి పేషెంట్ లకు సమయానికి వైద్యం అందిస్తూ, ఏ ఇతర ఔషధాల కోసం కూడా పేషెంట్ లు బయటకు వెళ్లకుండా.. ఆసుపత్రిలోనే అందించే విధంగా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా వచ్చే డబ్బులు సరిపోయేవి. ఆరోగ్యశ్రీ ట్రస్టులో ఇక్కడ పనిచేసే తాత్కాలిక ఉద్యోగి సరైన సమయానికి మూడు నెలల కాలపరిమితిలో పేషెంట్ వివరాలు అన్ని పూర్తిగా మూడు నెలల కాలపరిమితి లో సబ్మిట్ చేయకపోవడంతో సుమారు 8 కోట్ల వరకు నష్టం వాటిల్లింది.

ఆరోగ్య శ్రీ కింద జిల్లా జనరల్ ఆస్పత్రిలో 2022 ఏప్రిల్ 1 నుండి 2023 మార్చి 31 వరకు ఆరోగ్యశ్రీ పథకం కింద 9160 మంది రోగులకు వివిధ రకాల చికిత్సలు అందజేశారు. అయితే అందులో 5818 మంది వైద్యం చేయించుకున్న వారి బిల్లులు మాత్రమే ఆమోదితం పొంది ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా రూ.8,66,39,922 ఆమోదితం పొందినవి. మిగతా 3342 మంది రోగులకు సంబంధించినవి రిజక్ట్ అయ్యాయి. అయితే తిరిగి వాటిని మళ్లీ ఎంట్రీ చేయడంలో నిర్లక్ష్యం వహించి ఆలస్యం చేయడంతో ఆ డబ్బులు రాలేవు.

అదే విధంగా 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 8927 మంది రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేసుకోగా.. అందులో 2026 మందికి సంబంధించిన రూ.2,87,32,877 రూపాయలు ఆమోదితం పొందాయి. 6901 మంది రోగుల బిల్లులు తిరస్కరణకు గురికాగా.. మూడు నెలల కాల వ్యవధిలో తిరిగి పంపకపోవడంతో ఆ బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి

ఈ లెక్కన రెండు సంవత్సరాల కాలంలో మొత్తం 10,243 మంది రోగులకు సంబంధించిన సుమారు 9 కోట్ల రూపాయలు జీజీహెచ్‌కు అందకుండా పోయాయి.

ఈ బిల్లులు చెల్లింపు కాకపోవడానికి ముఖ్య కారణం తాత్కాలిక ఉద్యోగిగా పని చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్. సదరు వ్యక్తి నిర్లక్ష్యంతో ఆస్పత్రికి, చికిత్స అందజేసిన వైద్యులకు, వైద్య సిబ్బంది రావాల్సిన సుమారు 9 కోట్ల నిధులు రాకుండా పోయాయి.

పర్యవేక్షణ కరువు..?

ఆరోగ్య శ్రీ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మొత్తం 8 మంది సిబ్బంది ఉన్నారు. ఒక్క కేసుకు రూ.400 చొప్పున చెల్లిస్తున్నారు. ఆ డబ్బులనే అందరూ పంచుకోవాల్సి ఉంటది. కానీ అయితే వీరిలో ఒకరు పెత్తనం చెలాయించుతూ.. ఆరుగురికి ప్రత్యేకంగా రూ.19,500 వేతనం ఇప్పించడం గమనార్హం. కాగా పెత్తనం చెలాయించే వ్యక్తి పాస్ అయిన బిల్లుల ద్వారా రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.31 లక్షలు పొందడం గమనార్హం. సదరు సిబ్బందికి చెల్లింపులు సక్రమంగా చేస్తున్నా.. ఆరోగ్య శ్రీ బిల్లులు రాకపోతే పట్టించుకునే వారు కరువైయ్యారు. పర్యవేక్షణ లేకపోవడంతో రెండు సంవత్సరాల కాలంలోనే సుమారు 9 కోట్ల రూపాయల నిధులు రాకుండా పోయాయి. ఇక నైనా ఆరోగ్య శ్రీ కేసుల ఆన్‌లైన్ నమోదుపై దృష్టిసారించి నిధులు వచ్చేలా కృషి చేసి ఆస్పత్రిలో మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



నినాదాలు చేస్తున్న ఆటో కార్మిక యూనియన్ నాయకులు, డ్రైవర్‌లు

ట్రాన్స్‌ఫోర్టు కార్మికులకూ

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఆటో డ్రైవర్‌లకు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చినట్లుగా ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సైతం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్‌ల యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు కటారి రాములు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపైన విపరీతమైన జరిమానాలతో పాటు శిక్షలను వేసే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను ఆదుకోవటానికి నిధులను కేటాయించకుండా ఉపాధిని దెబ్బతీయటం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్, లైసెన్సులను, ఫిట్నెస్‌ను ప్రభుత్వమే భరించాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సును ఏర్పాటు చేయటంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్ల అందరికీ సంవత్సరానికి 12,000 భృతి అందజేస్తామని చెప్పిన దానికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదని వెంటనే డ్రైవర్లకు ఇచ్చిన హామీని అమలు జరపాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని ఎడల ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికుల ఉపాధి దెబ్బతిని ఆదాయం తగ్గింది అని అందువల్ల ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల నగర అధ్యక్షులు కృష్ణ, నాయకులు ముజీబ్, మజా రహమద్, అబ్దుల్., ప్రభాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సారెస్పీ 61వ వార్షికోత్సవం

- నెహ్రూకు నివాళి అర్పించిన అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 61 వ వార్షికోత్సవం శుక్రవారం అధికారులు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 26-7-1963 నాడు అప్పటి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ పోచంపాడ్ వద్ద పునాది రాయి వేసినరోజు నేటి శుక్రవారంతో 61 సంవత్సరాలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద గల నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా "నీటిపారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలు" అని నెహ్రూ అభివర్ణించిన మాటలను గణేష్ డిఈఈ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ శ్రీనివాస్ రావు గుప్తా , ఈ ఈ చక్రపాణి, కార్యక్రమంలో పాల్గొనిన, డిఎస్ఈ లాల్ సింగ్, డిఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూకు నివళి అర్పిస్తున్న అధికారులు

రుణమాఫీ పొందిన రైతులు

మళ్లీ రుణాలు తీసుకోవాలి

- సొసైటీ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం (పి) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే నూతన రుణాలను అందిస్తున్నామని పిఎసిఎస్ చైర్మన్, ఎన్డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 18-7-2024 వరకు రుణమాఫీ పొందిన వారిలో మొదటి విడుదల భాగంగా 83 మంది రైతులు సుమారు 34,30,980/-రూపాయల రుణమాఫీ లబ్ధి పొందారని తెలిపారు. మాఫీ వర్తించిన రైతులందరు బ్యాంకులో కానీ సొసైటీ సిబ్బందిని సంప్రదించి కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. రుణమాఫీ పొందని రైతులు కూడా వారి వారి ఖాతాలను బ్యాంక్ సిబ్బందినీ సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని, రుణమాఫీ జాబితాను బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎవరికైనా ఏదైనా ఇబ్బంది ఉంటే సొసైటీ సిబ్బందిని గాని తనను సంప్రదించాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా రైతులు తమను ఎల్లవేళలో కూడా సంప్రదిస్తూ వారి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం రైతులకు రుణమాఫీ చేసినందున సొసైటీ తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి, అలాగే రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయించాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకొండ ప్రభుత్వ వైద్యశాలలో పరిస్థితులను వైద్యాధికారికి వివరించినట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇదివరకు పని చేసిన గైనకాలజిస్ట్, డెంటిస్ట్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టు, ఎంఎన్‌డీ డ్రగ్ డ్రెస్సింగ్‌కు లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ అవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది కొరత కూడా ఉందని తెలిపారు. లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ అయిన వైద్యులు, సిబ్బంది స్థానాల్లో నూతన పోస్టింగులు ఇచ్చి సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి స్పందించి త్వరలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

పరిసరాలు ఇలానే ఉంటాయా..?

- పరిశుభ్రత పాటించకపోవడం పట్ల సిబ్బందిపై కలెక్టర్ సీరియస్
- రెండురోజుల్లో సరిచేసి ఫోటోలు దించి పంపాలని ఆదేశం

నవతెలంగాణ-రెంజల్

పరిసరాలు ఇలానే ఉంటాయా అని సిబ్బందిపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెంజల్ మండలంలోని పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిచ్చి మొక్కలతో నిండి ఉండడంతో ఆయన స్థానిక అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రెంజల్ మండలంలోని వన మహోత్సవం లో భాగంగా మండలాన్ని సందర్శించి మొక్కలు నాటారు. వీరన్న గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, పరిసరాల పరిశుభ్రత అస్తవ్యస్తంగా ఉండడం ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో పాఠశాలను పనులను వేగవంతం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్‌ను ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేయించాలని ఎంపీఓ రఫీ హైమద్‌ను, ఎంపీడీవోను ఆదేశిస్తూ రెండు రోజుల్లో పరిసరాలను పరిశుభ్రం చేసి వాటి ఫోటోలను తనకు పంపించాలని వారిని ఆదేశించారు. ప్రజా పాలన సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన బాధితులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దరఖాస్తులు స్వీకరించా లని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆదర్శ పాఠశాలలోని వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతోపాటు ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరిండెంట్ శ్రీనివాస్, డిఆర్‌డిఎ పిడీ సాయ గౌడ్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, డి రాజయ్య, ఏఈ వినయ్ కుమార్, ఎంపీఓ రఫీ హైమద్, గ్రామ కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

రుణమాఫీ కాకపోతే సంప్రదించండి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వజిద్ హుస్సేన్ రుణమాఫీపై క్షేత్ర పర్యటన చేశారు. ఇటీవల ప్రభుత్వం మొదటి విడతలో చేసిన రుణమాఫీ వల్ల లబ్ధి పొందిన రైతులతో క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి వారి నుండి రుణమాఫీ పైన అభిప్రాయాలు అడిగి తెలుసుకొన్నారు. రుణమాఫీ చేయడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఇంకా లక్ష లోపు అర్హత ఉండి రుణమాఫీ కానీ రైతులు వున్నట్లయితే బ్యాంక్, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.



రైతురుణమాఫీపై రైతుల ఫీడ్‌బ్యాక్ తెలుసుకుంటున్న వాజిద్ హుస్సేన్

పంటల నమోదు పరిశీలన

ఇనయత్ నగర్ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదును జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. మండలంలోని అన్ని క్లస్టర్ ల పరిధిలోని ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి రైతులు వేసిన పంట వివరాలు ఆన్‌లైన్‌లో జాగ్రతగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయిరాం రాజు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రపరచాలి

- ప్రజలు రోడ్లపై చెత్తవేస్తే జరిమానా వేయండి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సిబ్బందిని ఆదేశించారు. కామారెడ్డి పట్టణ పరిధిలో గల ఇందిరా నగర్ కాలనీ డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద "డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో" భాగంగా శుక్రవారం సందర్శించారు. రామారెడ్డి రోడ్డుకు ఇరువైపుల మురికి కుప్పలు తొలగించి మొక్కలు నాటాలని, రంగవల్లులు వేయించాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైనా రోడ్లపై చెత్త వేసినచో పెనాల్టీలు విధించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించినారు. డీఆర్‌సీసీ సెంటర్ ను సందర్శించారు. అనంతరం పెద్ద చెరువు ఫిల్టర్ బెడ్ సందర్శించి, చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా చేయించాలని ఆదేశించినారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ తదితరులున్నారు.



డబుల్ ఇండ్ల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ జెండాతో ర్యాలీ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో విద్యార్థులు 500 మీటర్ల పొడవు గల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ బోధన్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ రజతోత్సవాల విజయ్ దివస్ సందర్భంగా 500 మీటర్ల జాతీయ జెండాతో శక్కర్‌నగర్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా మారుతీ మందిర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి పట్టణ అధ్యక్షులు వడ్ల సతీష్ కుమార్ చారి మాట్లాడుతూ.. 1999లో కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌తో భీకర యుద్ధం చేసి కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాని పాకిస్తాన్ ఆక్రమించిన కార్గిల్‌ని తిరిగి సాధించారని అన్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన 527 మంది భారత సైనికులకు నివాళులర్పించారు. భారత దేశంతో ఆత్మీయతతో ఉంటే అమ్మలా గౌరవిస్తాం, సన్నిహితంగా ఉంటే చేయూత ఇస్తాం, అదే మా దేశంపైన కాలు దువ్వితే ఆ దేశాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన పాకిస్తాన్ సైన్యంకి కూడా భారత దేశ సైన్యం అంతక్రియలు చేసి ప్రపంచానికి మానవత్వం చాటి చెప్పిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ర్యాలీ

బాన్సువాడ విద్యుత్ డీఈపై

విజిలెన్స్ విచారణ

- విద్యుత్ శాఖలో అక్రమాలు బయటపడేనా..?

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సు వాడ డివిజన్ ట్రాన్స్ కో కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నా యనే వరంగల్ ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా ట్రాన్స్ కో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. బాన్సువాడ ట్రాన్స్ కో కాంట్రాక్టు పనుల అప్పగింతపై డీఈ కామేశ్వరరావు పక్షపాతం వహిస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారికే కాంట్రాక్టు పనులను అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ ఓ లైసెన్స్ కాంట్రాక్టర్ వరంగల్ సీఎండీకి ఫిర్యాదు చేశారు. దాంతో ట్రాన్స్ కో సీఎండీ ఆదేశాల మేరకు ట్రాన్స్ కో విజిలెన్స్ అధికారి రాజ్ భారత్ రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ డివిజన్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్ భారత్ రెడ్డి మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం మొదలైన విచారణ.. శనివారం వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. డీఈపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు. విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు లోతుగా విచారణ చేపడుతున్నామన్నారు. ఇప్పటికే కొందరిని విచారించామని, మరికొందరు అధికారులు, సిబ్బందిని విచారించాల్సి ఉందని తెలిపారు. బాన్సువాడ విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపితే మరికొన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని బాన్సువాడ నియోజకవర్గ రైతులు, కాంట్రాక్టర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ల కోసం కేటాయించిన స్థలాలను కొందరికి అప్పనంగా అప్పగించారనే ఆరోపణ ఉంది.



బాన్సువాడలో డివిజన్ కార్యాలయం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం జులై 27, 2024 www.navatelangana.com

హైవేపై అదుపుతప్పిన లారీరోలర్

- విద్యుత్ స్తంభాల ఢీ.. తప్పిన పెనుప్రమాదం



నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

వేల్పూర్ మండలంలో లక్కోరా నుంచి మెట్‌పల్లి వెళ్లే జాతీయ రహదారిపై గురువారం పెనుప్రమాదం తప్పినట్టయింది. పెర్కిట్ నుండి మెట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ రోలర్ వర్షం కారణంగా అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. స్తంభాలు ధ్వంసం కావడంతో కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా నిజామాబాద్ డిపో-1లో ఆర్టీసీ సిబ్బందికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి వైద్య పరీక్షలు గిరిజ అడ్వాన్స్‌డ్ ఐ కేర్ సెంటర్ , డాక్టర్ పి.బి. కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో రీజినల్ మేనేజర్ జాని రెడ్డి, డిపో మేనేజర్ ఆనంద్, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యారంగం విస్మరణ తగదు

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి
- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నా యని విద్యార్థి సంఘాలు, పలువురు విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయింపులు సవరించి విద్యారంగానికి అదనపు కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల నిరసన వ్యక్తం చేశారు.

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

యూఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం అమానవీయం అని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మండిపడ్డారు. కొఠారి కమిషన్ నిబంధనల ప్రకారం కేంద్ర బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం విద్యా రంగానికి కేటాయించాల్సిన అవసరం ఉందని, కానీ 48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్లో కేవలం 2.6 శాతం, రాష్ట్ర బడ్జెట్ 2.90 లక్షల కోట్ల బడ్జెట్లో కేవలం 7.3 శాతం అరకొర నిధులను కేటాయించి విద్యారంగం పట్ల తమ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించాయని మండిపడ్డారు. కేటాయించిన



కామారెడ్డిలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

బడ్జెట్ పని చేస్తున్న సిబ్బంది వేతనాలకే సరిపోయే పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగ సంస్థలు ఇప్పటికే శిథిలావస్థలో ఉన్నాయి మౌలిక సదుపాయాలు లేక కొట్టుమిట్టాలాడుతున్నటువంటి దీనస్థితిలో ఉన్నాయని, కేటాయించినటువంటి ఈ బడ్జెట్ తో ఏ విధంగా ప్రగతిని సాధిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తమ వైఖరి మార్చుకొని కొఠారి కమిషన్ నిబంధన ప్రకారం కేటాయింపులు చేయాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ గణేష్ జిల్లా సహాయ కార్యదర్శి సాయినాథ్ మారుతి సందీప్ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి శూన్య హస్తం : ఏబీవీపీ

విద్యారంగానికి ప్రభుత్వం సూన్య హస్తాన్ని చూపిస్తుందని ఏబీవీపీ ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాన్ని గద్దె దించడానికి తెలంగాణ యువత, విద్యార్థి, నిరుద్యోగులు కథనబేరీతోపాటు అనేక ఉద్యమాలు నిర్వహించారు. అదే అదనుగా శుష్కవాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు శూన్య హస్తాలు చూపిస్తున్నది. 8 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలని పరిష్కరించకపోగా విద్యారంగాన్ని మరింత అధ్వాన్న స్థితిలోకి నెట్టి వేస్తున్నది. వెంటనే విద్యారంగ సమస్యలన్నింటినీ పరిష్కరించి పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని' ఏబీవీపీ డిమాండ్ డిమాండ్ చేస్తున్నది.

విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం : ఏఐఎస్ఎఫ్

విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేదని బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే స్పష్టమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు రఘురాం అన్నారు. నిజామాబాద్ లో రైల్వే స్టేషన్ దగ్గర ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు టోకు,సాయి, సుమన్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను విద్యకు దూరం చేయడమే : బీవీఎం

కామారెడ్డి : విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అని భారతీయ విద్యార్థి మోర్చ (బీవీఎం) రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలో బడ్జెట్ కాగితాల దహనంను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. నాలుగేండ్లు రూ.8వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా నాయకులు యోగేష్, సాయి, తేజ, పట్టణ నాయకులు చరణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆగస్టు నుండి ఇచ్చే జీవనభృతిని స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఆగస్టు నెల నుండి ఇస్తానన్న జీవనభృతిని స్వాగతిస్తున్నాం అని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యూ) జిల్లా అధ్యక్షులు బి. భూమన్న అన్నారు. నిజామాబాద్ పట్టణ కేంద్రంలో గాయత్రీ నగర్‌లో హనుమంతు భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలో వస్తే బీడీ కార్మికులందరికీ 4000 వేల రూపాయలు చేయూత పథకం కింద జీవనభృతి ఇస్తామని హామీ ఇచ్చారని, హామీ అమలుకు యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా నిరసనలు చేపట్టినట్టు తెలిపారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రమంత్రి సీతక్క ఆగస్టు నేల నుండి చేయూత పథకం కింద జీవన భృతి ఇస్తామని ప్రకటించారని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు ఎం శివకుమార్ లక్ష్మి, మాధురి, కే లక్ష్మి, కనకవ్వ, అనిత, లావణ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.

మేకల వెంట కుక్కలు వదులుతున్నారు

- స్థానిక సమస్యలపై కార్యదర్శికి వినతి



కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న తెడ్డు పోశెట్టి తదితరులు

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై జన వికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ తెడ్డు పోశెట్టి మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యంగా మేకల సంత కారణంగా మేకలతో పాటు వాహనాలలో కుక్కలను తీసుకోనివచ్చి మండల కేంద్రంలో వదిలి వెళుతుండడంతో కుక్కల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. అలాగే వర్షాకాలం కారణంగా దోమల బెడద విపరీతంగా పెరిగిందని, శివాజీ నగర్ లో మిషన్ భగీరథ నీరు రావడంలేదని, స్ట్రీట్ లైట్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కార్యదర్శితో విన్నవించారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, జడల నరేష్, డాంగే సందీప్, నర్సింలు, వినయ్, షేక్ సద్దాం, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడాలభివృద్ధికి సర్కార్ కృషి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

క్రీడాలభివృద్ధి కోసం తెలంగాణ సర్కార్ ఎంతో కృషి చేస్తుందని నిజమాబాద్ జిల్ల ఒలంపిక్ సంగ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో ఆర్థిక శాఖామంత్రి క్రీడలకు 325 కోట్లు నిధులు కేటాయించడంపై శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో క్రీడా మైదానంతో పాటు సింతటిక్ ట్రాక్ నిర్మాణం చేయాలన్నారు. నిజామాబాద్ నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడి ఒలంపిక్ క్రీడలకు ఎంపికైన విషయాన్ని గుర్తుచేశారు. క్రీడలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖా మంత్రి బట్టు విక్రమార్క, క్రీడల సలహాదారుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కోచ్ లేకున్నా కూడా జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో ఒలంపిక్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

రెంజల్ ఎంపీడీవోగా వెంకటేశ్ జాదవ్



బాధ్యతలు చేపడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండల ఎంపీడీవోగా వెంకటేష్ జాదవ్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన హెచ్ .శ్రీనివాస్.. ఆయనకు బాధ్యతలను అప్పజెప్పారు. బోధన్ మండలం నుంచి వెంకటేష్ యాదవ్ రెంజల్ మండల ఎంపీడీవోగా బాధ్యతలను చేపట్టారు. సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ కొనసాగుతున్నారు.

మోపాల్ పీఆర్ఏఈగా మౌనిక

నవతెలంగాణ-మోపాల్

సాధారణ బదిలీలో భాగంగా మోపాల్ మండలానికి పంచాయతీరాజ్ ఎ ఇ మౌనిక బదిలీపై రానున్నారు. మౌనిక డిచ్‌పల్లి మండలం నుండి ఇక్కడికి బదిలీపై రానున్నారు. అలాగే అంతముందు కొన్ని రోజులు ఆర్ డబ్ల్యూ ఎస్ లో పనిచేశారు.

వీరజవాన్లకు సలాం చేసిన రాంపుర్ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలం లోని రాంపూర్ డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సైనికులకు సన్మానం చేశారు. ప్రతి ఏటా కార్గిల్ విజయ్ దివస్ 25వ వసంతోత్సవం సందర్భంగా రాంపూర్ ఎన్ సి సి ఆధ్వర్యంలో ఎన్ సి సి బెటాలియన్ నిజామాబాద్ లో విధులు నిర్వర్తిస్తున్న హవాల్దర్ అమిర్ పాటిల్, మహేంద్ర లను పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు దొండ గోవర్ధన్,ఎన్ సి సి అధికారి శ్రీనివాస్ ఖత్రి పాఠశాల సిబ్బంది సమక్షంలో ఘనంగా సన్మానించారు.

31న చలో హైదరాబాద్

- మధ్యాహ్న భోజన కార్మికులు హాజరై జయప్రదం చేయండి : ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 31న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. అదేవిదంగా కామారెడ్డిలో డిఈవో కి వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని పెడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్యను పెంచుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మంచి పేరు తీసుకురావటంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ మధ్యాహ్న భోజనానికి బడ్జెట్లో కేటాయింపులు పెంచకుండా వారికి రావలసినటువంటి బకాయి బిల్లులు చెల్లించకుండా కార్మికులతో చెలగాట మాడుతున్నారని అన్నారు. గత నాలుగు నెలలుగా ఆందోళన చేస్తుంటే నేటికీ కోడిగుడ్లు, 8,9 తరగతుల బిల్లులు చెల్లించలేదని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా పదివేల రూపాయల వేతనంపై నేటికీ స్పష్టత ఇవ్వడం లేదని, కార్మికులు వంట చేసేటప్పుడు ప్రమాదం జరిగితే కనీస ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడానికి పూనుకోవట్లేదని, యూనిఫారం పి ఎఫ్ ,ఇఎస్ ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31 న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టోకు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల తహసీల్దార్‌గా శ్రీలత



నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల నూతన తహసీల్దార్ గా శుక్రవారం శ్రీలత బాధ్యతలను స్వీకరించారు. గత కొన్నిరోజులుగా ఏర్గట్లలో పనిచేసిన మహమ్మద్ యూసుఫ్ ఆర్మూర్ ఆర్డీఓ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో భీంగల్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన శ్రీలత బదిలీపై ఏర్గట్లకు వచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఏ విధమైన కష్టం వచ్చినా తన కార్యాలయానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రమేష్, రాజయ్య, నరేందర్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి యువకుడికి ఉద్యోగ నియామక పత్రం



నవతెలంగాణ-ధర్పల్లి

ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు గుజ్జుల భరత్ రెడ్డి.. గత కొన్ని సంవత్సరాలుగా ఫైర్ స్టేషన్లో హోంగార్డు విధులు నిర్వహించారు. అనంతరం డ్రైవర్‌గా పోస్టుల్లో జరిగిన పరీక్షల్లో అర్హత సాధించి ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికైయ్యారు. కాగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్నారు. దీంతో ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

జీజీహెచ్‌లో చిన్న పిల్లలకు గుండెవైద్య శిబిరం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్న పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులపై ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ.. అపోలో హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిజిహెచ్ నాలుగో అంతస్తులలో డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటం, రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం లో 0-18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు గుండె సంబంధిత వ్యాధుల ఆరోగ్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో పిల్లలకు గుండె సంబంధిత పరీక్షలు (2డి-ఎకో) నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. మొత్తం (156) మంది శిబిరానికి హాజరు కాగా అందులో (53) మందిని గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. తుకారాం రాథోడ్, డి.యంహెచ్.ఓ, డాక్టర్ అశోక్ డి ఐ ఓ, డాక్టర్ అమూల్ గుప్తా, అపోలో హాస్పిటల్ హైదరాబాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి పి.యోహాన్ (డిస్ట్రిక్ డిప్యూటీ కమిషనర్ లేబర్ డిపార్ట్మెంట్ నిజామాబాద్), యం.పి.డి.ఓ. రవీందర్ ల అధ్వర్యంలో బదిలీ పై వెళ్లిన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇతర మండలల నుండి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు స్వాగతం పలుకుతూ వారిని పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యం.పి.ఓ. శ్రీనివాస్ గౌడ్, ఎ.పి.ఓ. (ఇ.జి.యస్.) సుధాకర్ రెడ్డి, అయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- ఎంపీడీవో చింత రాజశ్రీనివాస్

నవతెలంగాణ- కమ్మర్‌పల్లి

వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కలను సంరక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యకు సూచించారు. మొక్కలు నాటితే సరిపోదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారమని చెప్పారు. మనం నాటిన మొక్కలే వృక్షాలై మన భవిష్యత్తు తరాలకు ప్రాణ వాయువును అందిస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షునిగా హన్మాండ్లు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండల పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా గునిగెరి హన్మాండ్లు, కార్యదర్శిగా చందర్, అసోసియేట్ అధ్యక్షులుగా సంజీవులు, ఉపాధ్యక్షురాలుగా సుజాత, కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, ఈ ఎన్నికకు ఎన్నికల పరిశీలికులుగా జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుశాల్ వ్యవహరించారు. వీరు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సుపరిచితుడైన హన్మాండ్లు.. మూడు సార్లు మండల అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, పీఆర్‌టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు హనుమాన్లు మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో మరోసారి మండల ప్రెసిడెంట్‌గా అవకాశం ఇచ్చిన మండల పీఆర్‌టీయూ సభ్యులందరికీ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పలు గ్రామాలలో కూలిన ఇండ్లు



కూలిన ఇల్లు చూపుతున్న బాధితురాలు

నవతెలంగాణ-నిజాంసాగర్

ఏకధాటిగా గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో నివాసపు ఇల్లు కూలిపోయాయి. మండలం లోని మల్లూర్ గ్రామంలోని కర్రోల బలవ్వ, వడ్డేపల్లి గ్రామంలోని శాంతవ్వ, వడ్డేపల్లి చెరువు ముందు తండాలోని పాల్తే లక్ష్మి నివాసపు ఇల్లు పాక్షికంగా కూలిపోయాయని మండల రెవెన్యూ అధికారి బిక్షపతి తెలిపారు. శుక్రవారం కూలిపోయిన ఇండ్లను పరిశీలించి పంచనామ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు పురాతన ఇండ్లను పరిశీలించి అందులో ఎవరైనా నివసిస్తున్నట్లయితే వారిని వెంటనే శిబిరాలకు పంపించాలని ఎలాంటి ప్రాణం నష్టం జరగకుండా చూసుకోవాలని ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయన వెంట రెవేన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్లు సాయిబాబా డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో కార్మికుల కోసం బడ్జెట్ కేటాయించకపోవడం సరికాదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలన్నారు. ప్రతి జిల్లాలో కార్మికుల భవనం కోసం 500 గజాల స్థలం కేటాయించాలని, వెల్ఫేర్ బోర్డులో భవన నిర్మాణ కార్మికుని చైర్మన్ గా నియమించాలని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని,లేని పక్షంలో ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

'కార్గిల్ విజయ్ దివస్' పోటీల్లో ఇందూరు విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బోధన్

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఇందులో ఇందూర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారు. గోదావరి దేశభక్తి పాటలు పోటీల్లో మొదటి బహుమతి డి. నిఖిత, వకృత్వపు పోటీల్లో మొదటి బహుమతి బి. నికిత, వ్యాసరచన పోటీల్లో రెండో బహుమతి సాధించారు. విజేతలుగా నిలిచిన ఈ విద్యార్థులకు ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, కళాశాల ప్రిన్సిపల్ సురేష్, జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి, సీడీపీఓ జానకి, ఇందూర్ హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డ్రీమ్ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్దనున్న డ్రీమ్ స్టడీ సర్కిల్‌లో హాస్టల్ వసతితో తరగతులను ప్రారంభించినట్టు కరస్పాండెంట్ ఎండీ హజ్మత్ శుక్రవారం తెలిపారు. స్టడీ సర్కిల్ స్థాపించిన రెండు సంవత్సరాల్లోనే తమ పాఠశాలలకు జిల్లాస్థాయి ర్యాంకు సాధించి ప్రస్తుతం మెయిన్స్‌లో 99.275 శాతంలో ఆర్యన్ అనే విద్యార్థి ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. పట్టణంతో పాటు నిజామాబాద్‌లోని అత్యున్నత కోచింగ్ సెంటర్లలో ఒకటిగా నిలబడిందని తెలిపారు. తమ స్టడీ సర్కిల్ నుంచి గత బ్యాచ్‌లో జాతీయ స్థాయిలో వికాస్, వరుణ్, హర్షిని, జాగృతి, శ్రీవల్లి సైనిక స్కూలు, టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూలుకు ఎంపికైనట్టు తెలిపారు. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. క్లాసులు ప్రారంభించామని, ఈ నంబర్ 8897064243ను సంప్రదించాలని తెలిపారు.

ఇటీవలే నిర్మాణం.. ఇంతలోనే గుంతలు

● ప్రజలకు ఇక్కట్లు

నవతెలంగాణ-పోతంగల్

మండలం నుంచి మహారాష్ట్ర, మద్నూర్‌కు వెళ్లే ముఖ్య రహదారి రోడ్డు పని జరిగినా, కొద్ది రోజుల్లోనే అధ్వాన్నంగా మారింది. గుంతల మయమై రహదారిపై వెళ్ళే ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. మరోసారి మారమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంతలమయంగా మారిన రోడ్డు

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అర్హులైన 100 మంది అభ్యర్థులకు పది నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పిడబ్ల్యుడి యువతి, యువకులకు జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన వారికి రెసిడెన్షియల్ యూపీఎస్సీ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ఉచిత కోచింగ్ నిర్వహించబడుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్ విధానంలో www.tsstudycircle.com.in లో ఈనెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించడానికి గడువు పొడిగిస్తున్నట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన అనంతరం విద్యార్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష ఆగస్టు 11న నిర్వహించబడుతుందని తెలిపారు. నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన విద్యార్థులు, యువతీ, యువకులు వారి కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3లక్షల లోపు కలవారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



సదాశీవనగర్: మొక్కలు నాటుతున్న సీఈఓ



భిక్కనూర్ లో..



జుక్కల్ లో..

● జీపీల్లో ఫ్రైడే.. డ్రైడే నిర్వహణ

నవతెలంగాణ-జుక్కల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సిబ్బందికి సూచించారు. జుక్కల్ మండలంలోని హంగర్గ గ్రామ పంచాయతీ గ్రామంలో జీపీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించామని జీపీ కార్యదర్శి ఆశోక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ అధికారులు పలు సూచనలు చేశారు. గ్రామాలలను సందర్శించి ఫీవర్‌తో బాధ పడుతున్న వారిని సర్వే చేసారు. అధేవిధంగా లార్వల్ సర్వే, యాంటి లార్వల్ స్ప్రే వర్క్ మురికాలువల వద్ద, ఐఆర్ఎస్ స్ప్రే వర్క్, ఆరోగ్యం పైన గ్రామస్తులకు అవగాహన హెల్త్ వర్కర్లు కల్పించారు. గ్రామాలలో ముఖ్యంగా పారిశుధ్య పనులు నిత్యం చేయాలని పేర్కొన్నారు.

భిక్కనూర్ : మండలంలోని బస్వాపూర్, మల్లుపల్లి, ఇసన్నపల్లి గ్రామాలలో ఎంపీఓ రాజ్ కిరణ్ రెడ్డి ఫ్రైడే డ్రైడే సందర్భంగా గ్రామ ప్రజలకు పాత డబ్బాలు, కుండీలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో పర్యటించి స్వయంగా ఎంపిఓ పరిసరాలలో నిలువ ఉన్న నీటిని పారబోశారు. దోమలు వ్యాపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలములోని భూంపల్లి, పద్మాజీవాడి, మోడేగాం గ్రామలను జిల్లా పరిషత్ సీఈఓ. చందర్ నాయక్(ఇంచార్జ్) జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు పంచాయతీలను పర్యవేక్షించి ఫ్రైడే డ్రైడే, శానిటేషన్, నర్సరీ, ప్లాంటేషన్‌లలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎం.సురేందర్ రెడ్డి, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

నిధులు విడుదలపై కాలయాపన చెయ్యొద్దు

● ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరు శ్రీకాంత్



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నిధుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయొద్దని లేనిచో పరిణామం వేరే ఉంటుందని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరు శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నిధులు విడుదలపై కాలయాపన చేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. రేపు జరగబోయే పంచాయతీ ఎన్నికలు, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎలక్షన్‌లో కానీ కామారెడ్డి పట్టణం నుంచి మొదలు పెడతామని కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం అయ్యేంతవరకు పోరాడుతామని ఆర్యవైశ్య సంఘం తరపున పేర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ గరిపల్లి శ్రీధర్, మోత్కూరి శ్రీనివాస్, బోనగిరి శివకుమార్, పట్టణ కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేలో విద్యార్థులకు ప్రొఫెసర్ల అభినందన



టీయూ ప్రొఫెసర్‌కు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

గత విద్యా సంవత్సరం ఉత్తమంగా విద్యనభ్యసించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆర్కే విద్యార్థులను తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆరతి శుక్రవారం అభినందించారు. బీఎస్సీ, బీకాం, బిబిఏ, బిఏ కోర్సులలో అత్యుత్తమ గ్రేడ్లు సాధించి తెలంగాణ యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకుగాను, విద్యార్థులకు మెమెంటో, గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను బహుకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం, ఉత్తమంగా బోధిస్తూ, విద్యార్థులను ప్రోత్సాహపరచేలా ఆర్కే కళాశాల అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా ఆర్కే గ్రూప్ సీఈఓ డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నాణ్యమైన విద్యను అందించడంతో విద్యార్థులు మంచి మార్కులు, గ్రేడ్లను సొంతం చేసుకొని భవిష్యత్తులో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నామని ఈ విషయంలో ఆర్కే ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్స్ సైదయ్య, నవీన్ కుమార్, గోవర్ధన్, గంగాధర్, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సైనికుల పోరాట పటిమే కార్గిల్ యుద్ధ విజయం

● ఆర్డీవో జి.అంబాదాస్ రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న ఆర్డీవో

సైనికుల పోరాటం, ప్రాణత్యాగాల ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం ఎంతో మంది జవాన్లు ప్రాణత్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. 1999లో పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని పాక్ చేసిన ప్రయత్నాన్ని ఆపరేషన్ విజయ్‌తో కార్గిల్ నుంచి పాక్ సైనికులను తరిమికొట్టారన్నారు. అప్పటి అమరులైన భారత జవాన్లను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్ ఈరోజుతో రజతోత్సవం జరుపుకున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన అమర జవానులకు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు.

సైనికుడు తల్లిదండ్రులకు సన్మానం..

సైనిక శిబిరంలో విధి నిర్వహణలో మతి చెందిన కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన సైనికుడు గంగ ప్రసాద్ చిత్ర పటనికి పూల మాల వేసి నివాళులర్పించారు. అలాగే వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. అనంతరం కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గేయాల పోటీల్లో విజేతలకు మొదటి, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్, జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి ఎస్.కె.రసూల్ బి, సిడిపిఓ జానికి, మాజీ కెప్టెన్ వై.శ్రీనివాస్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌లు డాక్టర్ వి.నర్సింహులు, నాగేశ్వరరావు, శైలు, అధ్యాపకులు, ఎన్ సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ డిజిటల్ తరగతులపై అవగాహన

● ఉన్నత పాఠశాలలో స్కిల్లింగ్, డిజిటల్ ఇనిషియే టీన్స్ డే



ఎలక్ట్రానిక్ డిజిటల్ ద్వారా పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎలక్ట్రానిక్ డిజిటల్ తరగతులపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. శుక్రవారం మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ ఉన్నత పాఠశాలలో స్కిల్లింగ్, డిజిటల్ ఇనిషియే టీన్స్ డే నిర్వహించారు. శిక్షణ నైపుణ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారానికి ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులో ప్రధానంగా ఎలక్ట్రానిక్ టెక్నాలజీపై విద్యార్థి విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతుల వారీగా వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ డిజిటల్ బోధన్యాలను విద్యార్థి విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా నేర్చుకోవడం భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్ గౌడ్, గంగారాం, వ్యాయామ (పిఈటి) ఉపాధ్యాయురాలు సౌజన్య, అధ్యాపక బందం, పాల్గొన్నారు.

గాయత్రి షుగర్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి

● సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామకష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో ఉన్నటువంటి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం రుణాల పేరిట రైతుల ప్రమేయం లేకుండా కోట్ల రూపాయలను రుణాలు తీసుకొని రైతులను మోసం చేసిందని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోవిలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. షుగర్ ఫ్యాక్టరీలో సభ్యత్వం ఉన్నటువంటి రైతుల వద్ద నుంచి పాసుబుక్కులను ఫ్యాక్టరీ యొక్క యజమాన్యం తీసుకొని రైతుల పేరిట బ్యాంకులో రుణాలను తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో రైతుల ప్రమేయం లేకుండానే రుణాలు ఇచ్చినటువంటి బ్యాంకు యజమాన్యం, షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం ఇద్దరూ కుమ్మక్కై రైతులను మోసం చేశారని తెలిపారు. ఇందులో ప్రస్తుతం 2500 మంది రైతులు ఉండగా ఇందులో నుంచి 400 మందికి మాత్రమే మెసేజ్‌లు వచ్చాయని పేర్కొన్నారు. సుమారు 25 కోట్ల వరకు మధ్యవర్తుల ద్వారా రైతుల పేరిట గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ యొక్క కుంభకోణంపై సమగ్రమైనటువంటి విచారణ జరిపి బాధ్యులైనటువంటి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం, బ్యాంకు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని రుణాలు ఏవైతే ఉన్నాయో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతు సంఘాలను, ప్రజా సంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఏ.ప్రకాష్, కిషోర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, యువజన సంఘం నాయకులు రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్) నాయకులు

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఆర్‌టిఐ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం



మాట్లాడుతున్న ఆర్‌టిఐ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం

నవతెలంగాణ-కామారెడ్డి

మండల మహిళా సమైక్య మహిళలకు మండల సమైక్య భవనంలో నిర్వహించిన సమావేశంలో కొత్త చట్టాలపై ఆర్టిఐ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అవగాహన కలిగించారు. శుక్రవారం పట్టణంలోని గ్రామీణ మండల మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల అధ్యక్షులకు, కార్యదర్శులకు కామారెడ్డి జిల్లా డిఆర్‌డిఓ, పిడి శ్రీ చందర్ నాయక్ ఆదేశాల మేరకు, ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నూతన క్రిమినల్ చట్టాల గురించి సలీం వివరించారు. ఈ సందర్భంగా మహిళ న్యాయవాది షబానా బేగం మాట్లాడుతూ.. మహిళ హక్కులు, చట్టాల గురించి, వరకట్న చట్టం, మొదలగు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐబి డిపిఎం సుధాకర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కే.రాధ, కార్యదర్శి గోదావరి, కోశాధికారి మానస, డిపిఎం, బిఎల్ రవీందర్, 18 గ్రామ సంఘాల అధ్యక్షులు, గ్రామీణ సమైక్య సంఘ పాలకవర్గం, న్యాయవాది ఈక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం భావితరాలకు ఆదర్శం



మాట్లాడుతున్న అరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

నవతెలంగాణ- పోతంగల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వైద్య ఆరోగ్య శాఖ ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సందర్శించారు. శుక్రవారం ఈ సందర్శన వంటగది, విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాలు పరిశీలించారు. విద్యార్థులందరికి కలానుగుణంగా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల పూర్తిస్థాయిలో అవగాహనా కలిగించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాల పరిశుభ్రత కాపాడాలని, అందరికి ఈ విషయాలు తెలియ చేయాలని తెలిపారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు అందరు ప్రతి రోజు పొడి దుస్తులు ధరించటం వలన చర్మ వ్యాధులు రావని, తడి దుస్తులు ధరించటం వలన తరచుగా ఆరోగ్య సమస్యలు, చర్మవ్యాధులు రావటం జరుగుతుందని తెలిపారు. బయట ఎల్లప్పుడూ చిరు తిండ్లు తినకూడదని తెలియచేశారు.

రోడ్డు పనులు ఆపడానికి డబ్బులు వసూలు?



విస్తరణ చేపట్టనున్న రోడ్డు ఇదే

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణం నుంచి రాజంపేట మండలం వరకు రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, మొటాటిపల్లి, తలమడ్ల గ్రామం మీదుగా రోడ్డు విస్తరణ పనులకు టెండర్ల ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే.. రోడ్డు విస్తరణ పనుల కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అగ్రిమెంట్ పూర్తికాగానే రెండు లేదా మూడు నెలలలో పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం. రోడ్డు పనులు, కొలతలు పూర్తికాకముందే కొందరు నాయకులు తమ ఇండ్లు, వ్యాపార సంస్థల దుకాణాలు కూల్చకుండా ఆపడానికి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. నష్టం జరుగుతున్న వారి వద్ద నుంచి ఒక్కొక్కరి వద్ద కొంత డబ్బులు తీసుకొని నష్టం జరగకుండా ఆపడానికి ప్రయత్నాలు చేద్దామని కొందరు నాయకులు నష్టం జరుగుతున్న వారితో సంప్రదింపులు జరుగుతున్నట్లు పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. భిక్కనూర్ నుంచి రాజంపేట వరకు ఉన్న రోడ్డు ఆర్‌అండ్‌బి రోడ్డు పనుల వివరాలు, చేపట్టవలసిన పనులు పూర్తి అధికారం ఆర్‌అండ్‌బి అధికారుల చేతుల్లో కూడా లేదు. ప్రస్తుతం ఎంత వరకు రోడ్డు విస్తరిస్తారు.. ఎప్పుడు పనులు ప్రారంభిస్తారు.. పూర్తి వివరాలు తెలియక ముందే బాధితులకు నష్టపరిహారం జరగకుండా కొందరు నాయకులు వసూలు చేయడం ఏంటని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా నష్టం జరుగుతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేస్తారా..?, నష్టం జరగకుండా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తారా వేచి చూడాల్సి ఉంది.

ఆదర్శ పాఠశాలల్లో బదిలీలు చేపట్టాలి



నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరికొండ

ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ప్రభుత్వం బదిలీలు చేపట్టగా కొంతమంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో 11 సంవత్సరాల నుంచి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నా కూడా బదిలీల ప్రక్రియ ఆగిపోయిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ప్రభుత్వం వెంటనే బదిలీల విషయంలో చొరవ చూపి బదిలీలు జరిపించాలని కోరారు.

ఛలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టే మహాధర్నా కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సాలూరు మండలం, మందర్న గ్రామంలో మహా ధర్నా పోస్టర్లను ఎంఎ్మార్పిఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నాగురావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకై చేసిన పోరాటం 30 సంవత్సరాలుగా కొనసాగుతుందని తెలిపారు. చివరి దశలో వచ్చిన వర్గీకరణ అంశం తాడో రేవో తేల్చుకోవడానికి ఢిల్లీలో చేపట్టె మహా ధర్నా కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో బోనాల పండుగ

● ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి



పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా శుక్రవారం నిర్వహించరు. బోనాల పండుగలు పురస్కరించుకొని విద్యార్థులు వివిధ వేషాలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో యాజమాన్యం పున్న రాజేష్, పున్నా అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపిక్స్ క్రీడాకారులకు ఆల్‌దిబెస్ట్

నవతెలంగాణ-సదాశివనగర్



మండలం ధర్మారావుపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్యారిస్ ఒలంపిక్ వెళ్లే క్రీడాకారులకు విద్యార్థులు ఒలంపిక్స్ రింగ్స్‌లో కూర్చొని శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. క్రీడాకారులు ఒలంపిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి విజయం సాధించి దేశం కోసం పతకాలను ఎక్కువ మొత్తంలో తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు యూసేఫ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదాశివ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-పిట్లం

పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించుకోవాలని హెల్త్ అసిస్టెంట్ సిద్ధి రామాగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి ట్యాంకులు, మురికి కాల్వలు, నీటి కుండీల్లో నీటిని తరచు మార్చుకుంటూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఇంటింటి తిరుగుతూ ఆరోగ్య సలహాలతోపాటు విష జ్వరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిబాబా, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశా, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు సూచనలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అత్యవసర సమయంలో వారిని ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ సంజయ్ రావు, బీజేపీ మండల అధ్యక్షులు భూపాల్ రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షులు మనోజ్, నాయకులు రవీందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన్న ఎమ్మెల్యే

కాంతి హైస్కూల్లో హరితహారం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కాంతి హై స్కూల్‌లో యూకేజీ, ఎల్‌కేజీ పిల్లలతో హరితహారం కార్యక్రమాన్ని శుక్రవారం సంబురంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ.. అడవులను నరికి వేస్తుండటంతో మనకు మనమే ప్రమాదంలోకి వెళుతున్నామని అన్నారు. మొక్కలు పెంచడం ద్వారా వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించవచ్చని, సకాలంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. అందుకే మన పూర్వీకులు 'వృక్షో రక్షతి- రక్షిత్య' అని అన్నారని, వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని గుర్తు చేశారు. స్కూల్‌లో నాటినట్టుగానే ఇంట్లో, తమ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు



మొక్కలు నాటుతున్న చిన్నారులు

పీఆర్‌టీయూ మండలాధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల పీఆర్‌టీయూ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కృష్ణప్రసాద్‌ను తడపాకల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం శుక్రవారం ఘనంగా సన్మానించారు. కృష్ణ ప్రసాద్ గతంలో మూడేండ్లు మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, ఉపాధ్యాయులు సుధాకర్, రాములు, గంగాధర్, రవి, ఆనంద్, స్వప్న, విజయ పాల్గొన్నారు.

మండలస్థాయి అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల అధికారులతో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ హిమబిందు నిర్వహించారని ఆర్ఐ రామ్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో గ్రామాల్లో పాత ఇండ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయని, వాటిని కూల్చాలని తెలిపారు. గ్రామాల్లో రోగాల బారిన పడకుండా వైద్యాధికారులు గ్రామాలను సందర్శించే విధంగా అలెర్ట్ చేయాలని, శానిటేషన్, తాగునీరు, వీధి లైట్లు, విద్యుత్ స్తంబాల పరిస్థితి అంచనా, రోడ్ల మరమత్తులు లాంటి సమస్యలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని తహసీల్దార్ హిమబిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము, తాగునీటి ఏఈ నయూమ్, కౌలాస్ నాలా ప్రాజెక్ట్ ఏఈ రవిశంకర్, జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

- పలువురి రక్త నమూనాల సేకరణ

నవతెలంగాణ -లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరం శుక్రవారం మూడవరోజూ కొనసాగుతుందని వైద్య అధికారి హిమబిందు తెలిపారు. మండలంలోని వాసుల్దార్ గల్లీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా వైద్యులు స్థానికులను పరీక్షించి వారి రక్తనమూనలు సేకరించినట్టు ఆమె తెలిపారు. అనంతరం దోమల మందును పిచికారి చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు రామ్ రెడ్డి, సూపర్‌వైజర్ యాదగిరి, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, చంద్రకళ, ఆశ వర్కర్లు ఉన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులుగా క్యాతం రాజిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీజేపీ కిసాన్ మోర్చా జక్రాన్‌పల్లి మండల ఉపాధ్యక్షులుగా మునిపెల్లి గ్రామానికి చెందిన క్యాతం రాజిరెడ్డిని జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్ నియమించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో అతన్ని నియమించినట్టు పటేల్ తెలిపారు. రాజిరెడ్డి.. రైతుల సమస్యల పట్ల నిరంతరం శ్రమించాలని సూచించి అభినందనలు తెలిపారు.

కార్గిల్ అమరవీర సైనికులకు నివాళు లర్పించిన న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతీ నగర్ చౌరస్తా వద్ద శుక్రవారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతదేశ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. 1999 జులై 26న కార్గిల్ వద్ద పాకిస్తాన్ సైన్యాన్ని తరిమికొట్టిన భారత సైన్యం విజయకేతనం ఎగురవేసి నేటితో 25 సంవత్సరాలు అయిందని తెలిపారు. ఈ బీకర యుద్ధంలో ప్రాణాలను పణంగా పెట్టి దేశం కోసం వీరోచితంగా పోరాడి యుద్ధంలో అనేకమంది సైనికులు తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు పి.రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు, న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, అరేటి నారాయణ, శ్రీమన్, ప్రకాష్ ,తిరుపతి, బలరాజ్ నాయక్, మంజీత్ సింగ్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

హౌసింగ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పోతంగల్

కోటగిరి మండల కేంద్రంలో హౌసింగ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కట్టుకాలువ పనులు చేపట్టాలని తీర్మానం

- కుక్కలు, కోతల బెడద నుంచి కాపాడాలి
- గ్రామ సభ తీర్మానం

నవతెలంగాణ-లింగంపేట్

పురాతమైనటువంటి కట్టుకాలువ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాలని గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో శుక్రవారం తీర్మానం చేశారు. కట్టు కాలువ చెత్తాచెదారంతో కూడికపోయిందని దీంతో చెరువులోకి నీరు పోవడం లేదన్నారు. చెత్త చెదరం పేరుకు పోయి కాల్వలు పనిచేయడం లేదని, దాని వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. శాశ్వతంగా పనులు ఇరిగేషన్ శాఖ వారు సకాలంలో స్పందించి పూర్తిగా కాలువ నిర్మాణం పనులు చేపట్టినట్లయితే ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుందన్నారు. చెరువులలోకి నీరు కట్టుకోలపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులకు నీరు పుష్కలంగా వస్తుందన్నారు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని ఇంట్లో చొరబడి విలువైన వస్తువులను ధ్వంసం చేస్తున్నాయన్నారు. పలురుపై దాడికి ప్రయత్నం చేస్తున్నాయని, అదేవిధంగా కుక్కలు అధికంగా ఉండడంతో రాత్రివేళ దారి గుండా వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కలు, కోతుల బెడద నివారించాలని గ్రామస్తుల సమక్షంలో తీర్మానం చేశారు. పారిశుధ్యం లోపించకుండా రోడ్లపై చెత్త చెదరన తొలగించాలన్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఇంటింటికి మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తీర్మానం చేశారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అధికారుల అధ్యక్షతనలో గ్రామసభలను నిర్వహించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. ఈ గ్రామ సభలో ఎంపీడీవో నరేష్, ఎంపీఓ మలహరి, ఎమ్మార్వో నరేందర్, ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, అశ్వక్, కార్యదర్శులు ఆయా శాఖలో చెందిన అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభకు హాజరైన అధికారులు, ప్రజలు

భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నసురుల్లాబాద్ మండల ప్రత్యేక అధికారి టి. దయానంద్ తెలిపారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిసరాల పరిశుభ్రత, మొక్కల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. అనంతరం బొమ్మన్ దేవ్‌పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందిస్తూ ఇంటి వద్ద నాటాలని వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సకాలంలో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నారని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామంలో పారిశుద్యం లోపం లేకుండా గ్రామపంచాయతీ సిబ్బంది కృషి చేయాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి గ్రామాల్లో సేవలందించాలన్నారు, సమయపాలన పాటించని సిబ్బంది, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పచ్చదనం పెంచేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. పాఠశాల టీచర్లు సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యకాంత్, వివిధ గ్రామాల కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలతో విద్యార్థులు

ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ అనే ప్రోగ్రాం పోస్టర్‌ను మండల అభివృద్ధి అధికారి ఎం.సంతోష్ కుమార్, మండల పంచాయతీ అధికారి ఎం.సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాలలో ఎవరైనా నూతన పద్ధతులు ఆవిష్కరణ వినూత్న ఆలోచనలతో పరికరాలు తయారు చేయడం కొత్త పరికరాలు కనిపెట్టడం వంటివారు ఉన్నట్లయితే పూర్తి వివరాలు, వీడియోలు ఫొటోలతో సహా సంబంధించిన గ్రామ కార్యదర్శులకు, మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 3లోపు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాసాగర్, డిస్టిక్ కో ఆర్డినేటర్ గగన్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

చెట్లు ఉంటేనే క్షేమం

- ప్రత్యేక అధికారి విజయభాస్కర్

నవతెలంగాణ-నిజాంసాగర్

చెట్లు ఉంటేనే గ్రామం క్షేమంగా ఉంటుందని మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల యందు రెండవ జత ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించి, గ్రామంలోని ప్రకతి వనంలో చెట్లను ఆయన నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మొక్క పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీఓకు ఆదేశించారు. ఎక్కడైనా చెట్టు ఎండిపోతే వాటి స్థానంలో వెంటనే కొత్త చెట్లను పెట్టాలని ఆయన సూచించారు. మండలంలో మొత్తం 95,000 చెట్లను నాటే విధంగా చర్యలు తీసుకున్నామని ఇప్పటివరకు 68,000 చెట్లను నాటామని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల అభివద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత, ఏపీఎం రామ్ నారాయణ గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ బాలు సింగ్, పంచాయతీ కార్యదర్శి మతిన్, తదితరులు, పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ - బోధన్

బోధన్ మండలం పరిధిలోని పలు సమస్యలపై ప్రజా పాలన కౌంటర్‌కు వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన కౌంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎల్‌పీఓ మధుకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పీఆర్ఏ ఈ. సాయిలు తదితరులు ఉన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-నందిపేట్

మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే డెంగ్యూ, మలేరియా నుంచి రక్షణ పొందగలుగుతామని మెడికల్ ఆఫీసర్ డాబీ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో డెంగ్యూ, మలేరియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి కాలువలతో పాటు రోడ్లపై ఉండే మురుగునీటి వల్ల దోమల బెడద పెరుగుతుందని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. మురికి నీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, ఏఎన్ఎం శైలజ, ఆశ వర్కర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్స్

కామ్రేడ్ రాయల చంద్రశేఖర్‌కు నివాళులు

నవతెలంగాణ-బోధన్

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ కామ్రేడ్ రాయల చంద్రశేఖర్‌కు శుక్రవారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన సంతాపసభలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర నాయకులు వి. ప్రభాకర్ మాట్లాడారు. రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సభలో.. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్, బోధన్ మండల కార్యదర్శి సుల్తాన్ సాయిలు, నాయకులు ఓడ్డెన్న, ఎస్‌కే. నసీర్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పార్వతి రాజేశ్వర్, నాయకులు పుట్టి నాగన్న, పడాల శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కె. రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలి

- స్పెషల్ ఆఫీసర్, సీపీఓ రాజారాం

నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్

'ఫ్రైడే-డ్రైడే'లో భాగంగా కృష్ణాజివాడి ఉన్నత పాఠశాలను తాడ్వాయి మండల స్పెషల్ ఆఫీసర్, సీపీఓ రాజారాం కామారెడ్డి శుక్ర వారం ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాల విద్యార్థుల విద్యా ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వానా కాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు రెండవ జత ఉచిత యూనిఫామ్‌ను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ సంగమేశ్వర్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామి, ఏపీఎం రవీందర్, ఐకేపీ సీసీ నర్సింహులు, పంచాయతీ సెక్రటరీ చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసుల బాలరాజుకి ఘన సన్మానం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో సాధన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అగ్రో ఇండస్ట్రీ చైర్మెన్ కాసుల బాలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రెండు పడకల గదుల లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ1, విద్యా రంగానికి పెద్ద పీట వేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని తెలిపారు. అనంతరం కాసుల బాలరాజుని సీనియర్ కాంగ్రెస్ నాయకులు బీర్కూర్ గంగాధర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, మాజీ జెడ్పీటీసీ శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్, కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కోటగిరి విండో అధ్యక్షులు కూచి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు అప్డేట్ చేయండి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- డీపీఓ తరుణ్ కుమార్



మాట్లాడుతున్న డీపీఓ తరుణ్ కుమార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

చట్ట ప్రకారం పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తూ పంచాయతీ రికార్డులు అప్డేట్ చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ తరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డీపీఓ తరుణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీలు రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో డ్రయినేజీలను శుభ్రపరచాలని, పిచ్చి మొక్కలను తొలగిస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని తెలిపారు. గ్రామంలో ఎక్కువ మురికి, నీరు నిలిచి ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేసి దోమలు తయారు కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపీఓ యూసుఫ్ ఖాన్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగతో మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-సదాశివనగర్

యోగాతో మానసిక ప్రశాంతత ఉంటుందని ప్రదానోపాద్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పద్మాజివాడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యతో యోగా నేర్పిస్తున్నట్లు ప్రదానోపాద్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగతో ఏకగ్రత ఉంటుందని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పట్ల నిఘా

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో కల్పించే మధ్యాహ్న భోజన వసతి పట్ల చిన్నారి పిల్లలకు భోజన సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా నిఘా పెడుతున్నారు. శుక్రవారం మండలంలోని హెచ్ కేలూర్ గ్రామంలో గల పాఠశాలను నవతెలంగాణ సందర్శించగా మధ్యాహ్న భోజన వసతి కార్యక్రమంలో పాఠశాల చిన్నారులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు సంజు, రాజు, పకడ్బందీ నిఘా ద్వారా భోజనాలు సక్రమంగా జరగడానికి భోజన సమయంలో చిన్నారి పిల్లలు ఎలాంటి అల్లర్లకు ఎగబడకుండా క్యూ పద్ధతిన భోజనం అందించారు. శుక్రవారం నాటి భోజనంలో పప్పు అన్నం, అరటిపండు, గుడ్డు పెట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు పిల్లల పట్ల నిఘా పెట్టడం విశేషం.

ఛలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయండి

- సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు సురేష్ గొండ

నవతెలంగాణ-జుక్కల్

ఈ నెల 30న గ్రామపంచాయతీ కార్మికుల "ఛలో హైదరాబాద్" ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ శుక్రవారం పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు ఛలో హైదరాబాద్ కార్యక్రమనికి నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులందర్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 18వేలు ఇవ్వాలని కార్మికులందరికి 10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, మల్టిపర్పస్ విధానం రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లిస్తూ ప్రతి నేల 2వ తేదీన వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేమ్రాజ్ కల్లాలీలో ప్రత్యేక గ్రామ సభ

నవతెలంగా-జుక్కల్

మండలంలోని క్షేమాజ్‌కల్లాలీలో జీపీ గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి ప్రవీణ్ అద్యక్షతన స్పేషల్ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాదులు వ్యాప్తీ జరుగకుండా గ్రామాలలో ప్రత్యేక డ్రైట్యువ్ నిర్వహించాలని, శానీటేషన్ నిర్వహించాలని తెలిపారు. తాగు నీటీ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయాలని, జ్వారాలు వస్తే వెంటన్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో, జీపీ సెక్రట్రి, మహిళలు, యువకులు, ఆశాలు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి ప్రవేశాల కొరకు విద్యార్థులను ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, ఎన్‌సిసి ఆఫీసర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పరుగు పందెం, శారీరక పరీక్షలు నిర్వహించి 53 మంది విద్యార్థులను సుబేదార్ రాణా ప్రతాప్, హవల్దార్ సర్జిత్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ ఎంపీడీవోగా రాములు

నవతెలంగాణ-మోపాల్

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన లింగం నాయక్.. వెల్పూర్ మండలానికి బదిలీపై వెళ్ళారు. నూతనంగా వచ్చిన ఎంపీడీవోను సూపరింటెండెంట్ ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్ బోజన్న, ప్రియాంక, కార్యాలయ సిబ్బంది అనుష, శ్రీనివాస్, ఉమేష్, వంశీ తదితరులు సన్మానించారు.

మహిళా సంఘాల సమావేశం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండల మహిళ సమాఖ్యలో మండలాధ్యక్షురాలు వసంత అధ్యక్షతన మహిళా సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా శక్తి కార్యక్రమాలు, కొత్త సంఘాల ఏర్పాటు, వివిధ పనుల నిమిత్తం మహిళలకు ఋణసదుపాయల గురించి చర్చించడం జరిగిందని అధ్యక్షురాలు వసంత తెలిపారు. అలాగే అర్హత గల మహిళా సంఘాలకు మహిళ శక్తి ఋణాలను అందించాలని అధికారులను ఆమె కోరారు. కార్యక్రమంలో 13 గ్రామ సంఘాల ప్రతినిధులు, ఏపీఎం శ్యామ్, సీసీలు సంతోష్, నవీన్, అకౌంటెంట్ సుప్రియ, పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కృష్ణజింక మృతి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో శుక్రవారం వచ్చిన కృష్ణ జింకను కుక్కలు వేటాడి చంపాయి. జనావాసాల్లోకి వచ్చిన జింకను చూసిన కుక్కలు వెంటపడి దాడి చేయడంతో అది అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గంగమల్లయ్య అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దాంతో అటవీశాఖ అధికారులు చంద్రప్రకాశ్, వందన ఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. బోధన్ పశువుల ఆసుపత్రికి కళేబరాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేస్తామని అటవీశాఖాధికారులు తెలిపారు.



మృతి చెందిన కృష్ణజింకను తీసుకెళ్తున్న అటవీశాఖ అధికారులు

క్విజ్ పోటీలల్లో ఐదవ స్థానంలో
జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని



విద్యార్థికి టీషర్ట్‌ను అందజేత

నవతెలంగాణ-భీంగల్

ఇటీవల ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపిక్ క్విజ్ పోటీలలో పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ చెందిన వాణి ఐదో స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో 120 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో వాణి ఐదవ స్థానం నిలవడంతో గురువారం టీఎన్జీవో భవన్‌లో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నరసయ్య ఆధ్వర్యంలో సత్కరించి టీ షర్ట్‌తో పాటు రూ.500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ రమణకు, విద్యార్థిని వాణికి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు లింబాద్రి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం జాన్‌విల్సన్, రఘువాస్, రాజ్‌కుమార్, సంపూర్ణ, రాములు, వాసుదేవ్(పిఆర్‌టియు మండల అధ్యక్షులు), వినోద్ సాగర్, భూమేశ్వర్, మురళి, గంగామణి, పాల్గొన్నారు.

నాగపూర్‌లో ఫ్రైడే, డ్రైడే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో చేపట్టిన ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. శుక్రవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి కుండీలను, పూల కుండీలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనికి రాని టైర్లు, బకెట్లలో, ఖాళీ కొబ్బరి బొండాలలో నీళ్ల నిల్వ ఉంచకూడదన్నారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

దోమల నివారణ చర్యల పరిశీలన..

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన దోమల నివారణ చర్యలను ఎంపీడీవో పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందితో వర్షం నీరు నిలిచిన గుంతల్లో మురికి కాలువల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమల లార్వాను చంపేందుకు, దోమల నివారణ కోసం నీటి మడుగులో ఆయిల్ బాల్స్ వేయించాలని కార్యదర్శికి సూచించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల బదిలీలు ఆపాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుల బదిలీల పేరుతో ఆందోళన గురిచేస్తున్నారని ఆ ప్రయత్నాన్ని ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆవరణలో జరిగిన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య విభాగంలో పనిచేసే ఉద్యోగులు, జవాన్‌లను బదిలీ చేస్తామని అనడం మున్సిపల్ చరిత్రలో మొదటిసారి అన్నారు. మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు పారిశుధ్య విభాగంలో పనిచేయడం వల్ల అనేక చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఫిట్స్ లాంటి అనారోగ్య సమస్యలతో సతమతమవుతుంటారని తెలిపారు. ఆదివారం ట్రాన్స్‌ఫర్ అయితే ఇల్లు కూడా అద్దెకివ్వటం కష్టమని మీరు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నందున కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని బదిలీ చేయాలి గాని నిజాంబాద్ నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు బదిలీ చేస్తామనటం సరికాదన్నారు. పారిశుధ్య కార్మికుల బదిలీ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నర్సింగరావు, నాయకులు నరసయ్య, ఒడ్డెమ్మ చిన్న సాయమ్మ, రజిని, రాజేందర్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఈత, ఖర్జూర మొక్కలతో.. స్వచ్ఛమైన కల్లు

- బోధన్ ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ పవన్‌గౌడ్
- ఈత, ఖర్జూర చెట్లు నాటిన గీత కార్మికులు



కోటగిరి: మొక్కను నాటుతున్న పోలీసులు

నవతెలంగాణ- కోటగిరి/గాంధారి

ఈత, ఖర్జూర చెట్ల పెంపకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన కల్లు లభిస్తుందని బోధన్ ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గీతా పనివార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.విటల్ గౌడ్ ఆధ్వర్యంలో రాంపూర్ చెరువు కట్టపైన ఈత, ఖర్జూర మొక్కలను నాటే కార్యక్రమంలో బోధన్ ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్, ఎస్ఐ రామ్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం గీతా కార్మికులు 500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన వన మహోత్సవం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గీత పనివార్ల సంఘం గ్రామాల్లో గీత కార్మికులను చైతన్యం చేస్తూ వనం పెంపకం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి హామీ చట్టం ద్వారా గీత కార్మికులు ఖర్జూర, ఈతవనాన్ని పెంచితే ఒక్క చెట్టుకు 5 రూపాయలు మెంటెనెన్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ ఫీల్డ్ ఆఫీసర్ టీఎఫ్‌టీ కార్మికులు రాజా గౌడ్, సురేష్ గౌడ్, గీతా పని వాళ్ళ సంఘం మండల కమిటీ నాయకులు బి వెంక గౌడ్, కొత్తపల్లి శ్రీధర్ గౌడ్, బి. పండగ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, యాదగిరి గౌడ్ గీత కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఎల్లారెడ్డి ఆర్‌డీవో

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్.. రోడ్ డివైడర్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌సీఓ సురేందర్ , తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ చంద్రశేఖర్ సంస్మరణ సభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కామ్రేడ్ చంద్రశేఖర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష అన్నారు. శుక్రవారం కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభ పోస్టర్లను పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ భవన్, కోటగల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ 50 సంవత్సరాలుపైగా సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పనిచేశారన్నారు. కామ్రేడ్ చంద్రశేఖర మరణం పార్టీకి, విప్లవోద్యమానికే కాకుండా, పీడిత వర్గాలకు ఎనలేని లోటన్నారు. కామ్రేడ్ చంద్రశేఖర్‌కు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 28న సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తదితరులు ముఖ్యవక్తలుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వెంకన్న, సహాయ కార్యదర్శి సీహెచ్ సాయగౌడ్, జిల్లా నాయకులు డి.కిషన్, మురళి, మోహన్ పీ.ఓ.డబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకుడు సాయరెడ్డి, కిరణ్, గంగాధర్, పీఓడబ్ల్యు నాయకురాలు సుధారాణి, అమూల్య, నసీర్, సృజన్, శివకుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని అనుసరించాలి..

నవీపేట్ : విప్లవోద్యమానికి జీవితాన్ని అంకితం చేసి ఆకస్మిక మరణానికి గురైన కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని విప్లవ శ్రేణులు అనుసరించాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) రాష్ట్ర కమిటీ సభ్యులు నరేందర్ అన్నారు. మండలంలోని అభంగపట్నంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభను బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మౌనం పాటించి సంతాపాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, రాజేశ్వర్, లింబాద్రి, హన్మాన్లు, కవిత, సుజాత, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ ఫైనాన్స్‌కార్పొరేషన్‌కు నిధులు సరిపోవు

నవతెలంగాణ-నిజాంబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు 50 కోట్లు కేటాయించడం ఎటూ సరిపోవని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ శుక్రవారం తెలిపారు. మొట్టమొదటి సారిగా ముదిరాజులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల తమ వర్గాల్లో ఎంతో సంతోషాన్ని రేకెత్తించాయియని తెలిపారు. అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ, నిజామాబాద్ జిల్లా కమిటీ ముదిరాజ్‌ల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామనిఅన్నారు. కానీ ఈ బడ్జెట్ కేటాయించడం సరైనది కాదని రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల జనాభాలో అత్యధిక సంఖ్యాకులుగా ఉండి అత్యంత పేదరికంలో ఉన్న ముదిరాజులకు ఈ నిధులు ఎందుకు సరిపోవన్నారు. ముదిరాజులు దాదాపు 1000 కోట్ల బడ్జెట్ కోరుతుంటే కేవలం 50 కోట్లు మాత్రమే కేటాయించడం మా వర్గాలను అవమాన పరచడమే అవుతుందని, దానిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై పునరాలోచించాలని ఈ బడ్జెట్ సమావేశంలోపు ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు 1000 కోట్లు కేటాయించి రాష్ట్రంలో 13.8 శాతం ఉన్న ముదిరాజ్ జాతి అవసరాలను తీర్చుతూ మా ఆత్మగౌరవాన్ని నిలపెట్టాలని కోరారు.

కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిక్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఎండల రాజేష్‌కు, నూతన పంచాయతీ కార్యదర్శిగా వచ్చిన నవీన్‌ను గ్రామ యువకులు, సిబ్బంది ఘనంగా శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రాజేష్ మాట్లాడుతూ.. చిక్లి గ్రామానికి ఐదు సంవత్సరాలు సేవలందించినందుకు చాలా అదృష్టంగా భావిస్తున్నానని, ఈ గ్రామం యువకులు పెద్దలందరూ నాకు సహాయ సహకారాలు అందించి గ్రామ అభివృద్ధికి తోడ్పటునందించారు. గ్రామాన్ని వదిలి వెళ్లడం చాలా బాధాకరంగా ఉందని, గ్రామంలో యువకులు సిబ్బంది గ్రామ నాయకులందరూ ఎప్పుడు కలిసిమెలిసి ఉంటూ అభివృద్ధికి పాటుపడే వారన్నారు. తను గ్రామానికి అందించిన సేవలు బాధాకర విషయాలు గ్రామస్తులతో పంచుకున్నారు. అనంతరం నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి నవీన్, పదవీ విరమణ పొందిన ఎంపీటీసీ కారం సుజాతకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డ్ మెంబర్లు, మాజీ ఎంపీటీసీ భోజన్న, ఉప సర్పంచ్ రవి, ఎడ్ల అశోక్ దేవేందర్, షేక్ షబ్బీర్, రంజాన్, సాగర్, సాయి గౌడ్, కారోబర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జీపి కార్యదర్శులను సన్మానించిన పలువురు

తృటిలో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-బాల్కొండ

కారు అదుపుతప్పి ఓ ఇంటి సమీపంలోని డ్రైనేజీలో దూసుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. చుట్టుపక్కల యువకులు గమనించి కారును బయటకు తీశారు. ఈ ఘటనలో కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది, ఎలాంటి ప్రాణ నష్టం సంభవిన్చకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చందూర్ ఎంపీడీఓగా నీలావతి

- కృతజ్ఞతలు తెలిపిన ఎంపీడీఓ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-వర్ని

నసురుల్లాబాద్ మండ లం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన నీలావతి మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీని వాస్‌రెడ్డి చొరువతో చందూర్ మండల ఎంపీడీఓగా బదిలీపై బాధ్యతలు తీసుకోబోతున్న సందర్భంగా ఎంపీడీఓ నీలావతి కృతజ్ఞతలు తెలిపారు. ప్యాక్స్ చైర్మన్ అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సమస్యలు పరిష్కరించండి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-రెంజల్

మండలంలో రుణమాఫీపైన ఏలాంటి సమస్యలు ఉత్పన్నమైన రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ మండల వ్యవసాయ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. రైతు వేదికలలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు తమ సేవలను అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరిండెంట్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అజయ్, ప్రసాద్, గోపికృష్ణ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు, యువజన సంఘం నాయకులు విఘ్నేష్‌గౌడ్ వేంపల్లి గ్రామంలో స్థానిక క్రీడాకారులకు క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు విఘ్నేష్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో సైతం క్రీడాకారులను ప్రోత్సహించేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వేంపల్లి యువజన సంఘం నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని లక్ష్మపూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూంల లబ్ధిదారులకు ఏమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు చేతుల మీదుగా కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం పంపిణీ చేశారు. లక్ష్మపూర్ గ్రామానికి చెందిన 26 మందికి రూ.40 లక్షల చెక్కులను అందించారాని మాజీ సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమం మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మండల అధ్యక్షులు పోతారాజు శ్రీను, నెమని విరాజ్, సంజవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందికి సూచనలు

- ఎంపీవో మహమ్మద్ గౌస్

నవతెలంగాణ-ముప్కాల్



పరిసరాల పరిశీలన

మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో ఎంపీవో మహమ్మద్‌గౌస్ ఆరోగ్య సిబ్బంది (ఆశ వర్కర్ల)తో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి శుక్రవారం తెలుసుకున్నారు. వాతావరణం దృష్ట్యా గ్రామాల్లో అందుబాటులో ఉంటూ గ్రామస్తులకు రోగాలు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మురికివాడల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను పంచాయతీ సెక్రటరీలకు వివరించారు. డ్రైనేజీల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామపంచాయతీ సెక్రటరీలు గౌతమి, రాజ్యలక్ష్మి, రాజు, కె.విఘ్నేష్, టీ.నగేష్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

ఫోన్ల రికవరీలో నంబర్ వన్‌లో ఒకటవ పోలీస్ స్టేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 1వ పోలీస్ స్టేషన్ ఫోన్ల రికవరీలో నంబర్ 1 స్థానంలో నిలిచింది. ఫోన్లు చోరీకి గురైన, పోగొట్టున్న వారి నుంచి 1,432 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 904 సెల్ ఫోన్లను గుర్తించారు. అందులో 504 మంది బాధితులకు ఫోన్లు అందించడంతో 1వ ఠాణా ప్రథమ స్థానంలో నిలిచింది.

నేడు 320 ట్రాక్టర్ల ఇసుక వేలం పాట

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారులో 320 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంపులను సీజ్ చేశామని, పట్టి ఇసుకను గనులు భూగర్భ శాకా అధికారుల సమక్షంలో శుక్రవారం 1గంటకు సీజ్ చేశామని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. అక్రమ ఇసుక వేలం పాట ఈరోజు ఉదయం 11.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనుడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేళం పాటలో పాల్గొన వలసిందిగా ఆయన కోరారు.

ముగిసిన మూవీ షూటింగ్

నవతెలంగాణ-బోధన్

మండలంలోని మినార్‌పల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ దర్శకత్వం వహిస్తూ నిర్మాతగా, హీరోగా చేస్తూ నటించిన చిత్రం షూటింగ్‌ను నర్సారెడ్డి గోదాంలో నిర్వహించారు. శుక్రవారం జరిగిన సినిమా షూటింగ్‌లో కన్నడ నర్సింగ్ ప్రధాన విలన్‌గా హీరోతో జరిగే ఫైట్ సీన్‌ను చిత్రీకరించారు. దీనికి పట్టణ వాసి ప్రముఖ కరాటే మాస్టర్ షేక్ ఖయ్యూం స్టంట్ మేన్‌గా వ్యవహరించారు. చిత్రం షూటింగ్ ముగిసిందని తదుపరి షెడ్యూల్ హైదరాబాద్, రాజమండ్రిలో ఉంటుందని హీరో, దర్శక, నిర్మాత ఆదినారాయణ తెలిపారు.

బడ్జెట్‌లో వికలాంగులపై వివక్ష చూపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఎన్‌పిఆర్‌డి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధం



బోధన్: బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

బడ్జెట్ కేటాయింపులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల పట్ల వివక్షచూపి వారి సంక్షేమానికి ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదని ఎన్‌పిఆర్‌డి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధర్ ఆరోపించారు. శుక్రవారం మండలం పెంటాకుర్ద్ గ్రామంలో నిర్వహించిన వికలాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌ను సవరించి 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపు ప్రస్తావనలేని కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు వికలాంగులను పట్టించుకోకుండా మోసం చేశారన్నారు. అనంతరం ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సాధికారతకు 2024-25 బడ్జెట్లో 1225.27 కేటాయించిందని గత సంవత్సరంలో బడ్జెట్‌తో పోలిస్తే 0.02. శాతం పెంచింది అన్నారు. వికలాంగుల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాల కోసం కేవలం 615.33 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌ను ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించి కేంద్రం రూ.3000 పెన్షన్, రాష్ట్రము రూ.6000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఇంటి స్థలాలు, ఇండ్ల నిర్మాణం కోసం పది లక్షల రూపాయలు కేటాయించాలని, వికలాంగులకు ప్రత్యేకంగా అంత్యోదయ కార్డులు కేటాయించి నెలకు 35కిలోల బియ్యం ఇవ్వాలని, స్వయం ఉపాధి రుణాలు ప్రతి వికలాంగుడికి ఐదు లక్షలు ఇవ్వాలని, తదితర సమస్యలన్నీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పిఆర్‌డి జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు ముంజ సాయిలు, ఎల్లయ్య, ఈశ్వర్ పటేల్, గంగారం పటేల్, జయరాం, సాయినాథ్, పల్లికొండ చింటూ, సోనీ, రామచంద్రరావు, గంగమణి, లక్ష్మి, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలకు నీళ్లు చల్లిన బడ్జెట్ : మాజీ జెడ్పిటిసి

మోపాల్ : ప్రజల ఆశలకు నీళ్లు చల్లిన బడ్జెట్ అని మాజీ జెడ్పిటిసి కమలా నరేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిరాశ మిగిలిందని, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చి బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు కేటాయించడం సరైనది కాదన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యపై ఎంత అవగాహన ఉందో ఈ బడ్జెట్ బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఉన్నత విద్యారంగానికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవు, కనీసం 15 నుంచి 20శాతం తగ్గకుండా నిధులు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలపైన స్పష్టత కరువైందని ముఖ్యంగా రుణమాఫీకి కావలసిన బడ్జెట్‌లో భారీ కోత విధించిందని తెలిపారు. ముఖ్యంగా దళిత బంధు ఊసే ఎత్తలేదని, యాదవులకి ఇస్తున్న గొర్రెల పెంపకం పథకాన్ని మొత్తానికి మూసేసినట్లు అర్థమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పారదర్శకంగా లేవని అత్యంత బడుగు, బలహీన వర్గాలకు మేలు చేస్తానని చెప్పినే వారి గొంతు కోస్తుంది. ఏ ఒక్క వర్గానికి కూడా ఈ బడ్జెట్‌లో భరోసా లేదు. బడ్జెట్‌లో నిరుద్యోగులకు 4000 భృతి, ఏడాదిలోని రెండు లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రస్తావించలేదన్నారు. రైతులు మహిళలు, యువత, ఎస్సి, ఎస్టీ, డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు కేటాయించలేదని ఇది అబద్ధాల ప్రభుత్వమని ఆయన ధ్వజమెత్తారు.